ఊసేలేని 'పీఎంకేఎంవై'..



- అన్నదాతలకు ఏళ్లుగా అందని పథకం
- అవగాహన కల్పించని అధికారులు
- ప్రీమియం చెల్లించని రైతులు
- అమలు పరచాలని రైతులు వేడుకోలు

ముదిగొండ: ఆరుగాలం శ్రమించిన రైతులకు వృద్ధాప్యంలో చేదోడుగా ఉండేందుకు పింఛన్ అందించాలని కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ మాన్ ధన్ యోజన (పీఎంకేఎంవై) పథకాన్ని ప్రారంభించింది. దీంతో 60ఏళ్ల దాటిన వారికి ప్రతి నెలా రూ.3వేల పింఛన్ అందించబడుతుంది. వయస్సు ఆధారంగా ప్రీమియం చెల్లించాలి. కాకపోతే గత మూడేళ్ళుగా ఈ పథకం ఊసేలేకుండా పోయింది. ఇదివరకైతే వ్యవసాయాధికారులు ప్రత్యేకంగా గ్రామ సభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించేవారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారులు విస్మరించడంతో పథకం అటకెక్కించే విధంగా ఉందని రైతులు వాపోతున్నారు. పథకం అమలుపరిస్తే కొన్ని లక్షల మంది రైతులకు వృద్ధాప్యంలో ఉపయోగంగా ఉంటుందని, పథకాన్ని కొనసాగించాలని రైతులు కోరుతున్నారు.

రూ.55లతో ప్రారంభం..

పీఎంకేఎంవై పథకంలో చేరిన రైతులు వారి వయస్సు ఆధారంగా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. 18ఏళ్ల వయస్సు ఉంటే రూ.55లు, అదే 40ఏళ్ల ఉంటే రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. ఎప్పుడు నమోదు చేసుకున్నా 60ఏళ్ల దాటాకే పెన్షన్ వస్తుంది. ఈ పథకాన్ని అర్హత ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని అప్పట్లో వ్యవసాయ అధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహించారు. అంతేకాకుండా ఆన్‌లైన్ ద్వారా రైతుల వివరాలు నమోదు ప్రక్రియ ప్రీమియం చెల్లింపులు కూడా చేశారు.

క్షేత్ర స్థాయిలో ప్రచారం...

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిసాన్ మాన్‌ధన్ యోజన పథకాన్ని క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో చాలా వరకు ఈ పథకం ఉద్దేశ్యం అర్థం కావటం లేదు. దీనిపై వ్యవసాయాధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో రైతులకు మరింత సమగ్ర సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు. తూతూ మంత్రంగా సభలు నిర్వహించకుండా.. రైతులకు అర్థమయ్యేలా వివరిస్తే.. ప్రయోజనం ఉంటుంది.

నిబంధనలు ఇలా..

- కిసాన్ మాన్‌ధన్ యోజన పథకం లబ్ధిపొందే వారు 5 ఎకరాల లోపు సాగు భూమి ఉండాలి.
- వయస్సు 18 నుంచి 40 సంవత్సరాలు కలిగిన రైతులు మాత్రమే అర్హులు.
- పథకం పొందడం కోసం భర్త, భార్య ఇద్దరూ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.
- రైతులు ప్రీమియం ప్రతీ నెల చెల్లించే దానికి సమానంగా నిధిని కేంద్ర ప్రభుత్వం రైతు కోసం చెల్లిస్తుంది.
- ఒకవేళ నిర్ణీత వయస్సు కంటే ముందే మరణిస్తే అప్పటి వరకు చెల్లించిన మొత్తాన్ని వడ్డీతో సహా రైతు సూచించిన నామినీకి చెల్లిస్తారు. లేదా భర్త మరణిస్తే భార్య, భార్య మరణిస్తే భర్త ఈ పథకాన్ని కొనసాగించవచ్చు.
- పెన్షన్ పొందే రైతు మరణిస్తే అతని భార్య లేదా నామినీకి రూ.1,500 ప్రతీ నెల పొందుతారు.
- పథకం లబ్ధిపొందే రైతులు అన్ని వివరాలతో కూడిన దరఖాస్తును మీ సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలి.
- రైతు ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం, పాన్‌కార్డు, ఫోన్ నంబర్ జత చేయాల్సి ఉంటుంది.

ఆదేశాలు రాలేదు..



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంకేఎంవై పథకం గురించి గతంలో కొంతమందికి రైతులకు మాత్రమే తెలుసు. ప్రతీ రైతు సద్వినియోగం చేసుకోవడానికి మూడేళ్ల క్రితం నెలకు రూ.3 వేల పింఛన్ పొందే అవకాశం కల్పించారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– విజయచంద్ర, ఏడీఏ, మధిర

అవగాహన కల్పించాలి..



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం రైతులందరికీ తెలిసేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేలా సదస్సులు నిర్వహించాలి. మళ్లీ ఈ పథకం అమలు చేస్తే ఎంతోమంది రైతులకు మేలు జరుగుతుంది. అధికారులు చొరవ తీసుకోవాలి. కూలీలు, కౌలు రైతులను కూడా ఈ పథకంలో చేర్చాలి.

– మరికంటి శ్రీనివాస్, యువరైతు, బాణాపురం

క్లుప్తంగా

గెస్ట్ ఉపాధ్యాయ పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఏన్కూరు: వైరా జనరల్ బాలికల గురుకుల విద్యాలయంలో బయోసైన్స్ గెస్ట్ ఉపాధ్యాయ పోస్టుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల జిల్లా కన్వీనర్ తుడి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. నేటి నుంచి ఈ నెల 8తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని, 9న ఏన్కూరు గురుకులంలో డెమో ఉంటుందన్నారు. బోధన అనుభవం ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఇంగ్లీష్ మీడియంలో బోధించాలని కోరారు.

నానో యూరియాతో మంచి ఫలితాలు



అవగాహన కల్పిస్తున్న ఏఓ వినయ్‌కుమార్

బోనకల్: పంటల సాగులో ద్రవ రూపంలో ఉండే నానో యూరియాను వాడుకోవాలని ఏఓ పసునూరి వినయ్‌కుమార్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని చిన్నబీరవల్లి గ్రామంలో నానో యూరియాపై మంగళవారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించి మాట్లాడారు. నానో యూరియాతో పర్యావరణానికి అనుకూలంగా ఉండటమే కాకుండా గ్రీన్‌హౌస్ వాయువులుగా వాతావరణంలో కోల్పోయే నత్రజని మొత్తాన్ని తగ్గిస్తుందని రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి షేక్ హుస్సేన్ సాహెబ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పంటలు పరిశీలన

ముదిగొండ: మండలంలోని చిరుమర్రి, పమ్మి, బాణాపురం, ముదిగొండ, మాదాపురం గ్రామాల్లో రైతులు సాగుచేసిన పత్తి పంటలను ఏఓ సరిత మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పంటల సాగులో నానో యూరియా వాడకం, దాని ఆవశ్యకతపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి సూచిపై సమావేశం

ముదిగొండ: మండలంలోని ముదిగొండ జీపీ అభివృద్ధి సూచిక నిర్ధారణలో భాగంగా మంగళవారం స్థానిక జీపీ కార్యాలయంలో వివిధశాఖలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించిన సమాచారంపై చర్చించారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీధర్ స్వామి, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, పశు వైద్యాధికారి అశోక్, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

చింతకాని: మండలకేంద్రలోని అనారోగ్యంతో బాధపడుతున్న కొమ్మిని కృష్ణయ్య, పుట్ట వెంకటరమణ, బోయిన కోటయ్యలకు వైద్యఖర్చుల నిమిత్తం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కృషితో మంజూరైన రూ. 1.23లక్షల విలువైన చెక్కులను మంగళవారం కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో నాయకులు గోపి, సైదేశ్వరరావు, అబ్దుల్ మజీద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

వైరారూరల్: మండలంలోని స్టేజీ పినపాక సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో సిరిపురం మాజీ ఎంపీటీసీ మట్టూరి కృష్ణారావుకు తీవ్ర గాయాలయ్యాయి. వైరా నుంచి కృష్ణారావు మంగళవారం ఉదయం స్వగ్రామమైన సిరిపురం వెళ్తుండగా హైలెవల్ వంతెన వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనకు వైరాలో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

ఇకపై విద్యుత్ అంతరాయాలు ఉండవు..



నాచారంలో సబ్‌స్టేషన్‌లో ఎస్ఈ శ్రీనివాసాచారి, ఉద్యోగులు

ఏన్కూరు/కల్లూరురూరల్: ఏన్కూరు మండలంలోని నాచారంలో సబ్‌స్టేషన్‌లో పరిధిలో ఇకపై విద్యుత్ అంతరాయాలు ఉండదని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాసాచారి తెలిపారు. నాచారం సబ్‌స్టేషన్‌లో 11కేవీ ఫీడర్ బ్రేకర్‌ను మంగళవారం చార్జ్ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రేపల్లెవాడ, నాచారం ఫీడర్లు కలిసి ఉండగా, ఏదైనా సమస్య ఎదురైతే రెండు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. ఇప్పుడు అలా జరగకుండా చర్యలు చేపట్టామని ఎస్ఈ చెప్పారు. అలాగే, కల్లూరు మండలం బత్తుపల్లి సబ్‌స్టేషన్‌కు రూ.39 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 33/11 కేవీ లైన్‌ను ఎస్ఈ శ్రీనివాసాచారి మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ఈ లైన్‌తో పది గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డీఈ లూనావత్ రాములు, ఏఈలు పి.వెంకట్, ఉమాకాంత్, ఉద్యోగులు సీహెచ్.వెంకటేశ్వర్లు, గోపాల్‌రావు, రామకృష్ణ, శ్రీకాంత్, నాగరాజు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు..



రికార్డులు పరిశీలిస్తున్న మధిర ఏడీఏ విజయ్ చంద్ర

చింతకాని: రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మధిర ఏడీఏ విజయ్ చంద్ర అన్నారు. మంగళవారం మండలంలోని నాగులవంచ, చింతకాని, కొదుమూరు గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి, స్టాక్, సేల్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు, ఇన్‌వాయిస్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీలర్లు రైతులకు సరిపడా ఎరువులను అందించాలని, తప్పనిసరిగా స్టాక్ బోర్డులు ఏర్పాటు చేసి, బిల్లులు ఇవ్వాలని, ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఓ మానస, వ్యవసాయ విస్తరణాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులకు చట్టబద్ధత కల్పించాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కారేపల్లి: గ్రామాల్లో ప్రాథమిక వైద్యం చేసుకుంటూ జీవిస్తున్న గ్రామీణ వైద్యులపై టీజీఎంసీ చేస్తున్న దాడులు ఆపి, చట్టబద్ధత కల్పించాలని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టల నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కారేపల్లిలో ఆ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆనాటి వైఎస్సార్ ఆర్ఎంపీలకు ప్రాధాన్యత ఇస్తూ పారామెడికల్ బోర్డుతోపాటు, పలు జీవోలను తీసుకొచ్చారన్నారు. వైద్యులు ఆ బోర్డుకు దరఖాస్తు చేసుకుంటే అర్హులైన వారికి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందించారన్నారు. ఆతర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన కేసీఆర్ పట్టించుకోలేదని, కనీసం కాంగ్రెస్‌అయినా న్యాయంచేస్తుందనుకుంటే అధికారంలోకి వచ్చిరెండేళ్లు అయినా ఆ ఊసే ఎత్తడంలేదన్నారు. ఈ విషయమై ఈ నెల 7న ఖమ్మం రూరల్ మండలం మారెమ్మతల్లి గుడి వద్ద గల ఫంక్షన్ హాల్‌లో సంఘం ఆధ్వర్యంలో మూడు జిల్లాలు.. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల జనరల్ బాడీ సమావేశం ఉంటుందని, గ్రామీణ వైద్యులు పాల్గొనాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతారపు వెంకటాచారి, మండల అధ్యక్షుడు వీరయ్య చౌదరి, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరామయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఆత్మీయ భరోసా అందించాలి



మధిర: డిప్యూటీ తహసీల్దార్ డేవిడ్ కరుణాకర్‌కు వినతి ఇస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

మధిర/చింతకాని/బోనకల్/కొణిజర్ల: భూమిలేని వ్యవసాయ కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు మరీదు ఈశ్వరమ్మ, సహాయ కార్యదర్శి సింగారపు సత్యనారాయణ, కార్యవర్గ సభ్యుడు కొండూరి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మధిర, చింతకాని తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ కరుణాకర్ లకు వినతులు అందించారు. అదే విధంగా బోనకల్‌లో సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో తహసీల్ సిబ్బందికి, కొణిజర్లలో భారతీయ కిసాన్ మజ్దూర్ యూనియన్ అనుబంధ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ రాముకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల హయాంలో కాంగ్రెస్.. భూమి లేని వ్యవసాయ కార్మికులకు రూ.12,000 ఇస్తామని, ఇప్పుడు జాతీయ ఉపాధిహామీకి మెలిక పెట్టడం సరికాదన్నారు. గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించి భూమిలేని నిరుపేదలకు భూ పంపిణీ చేయాలని, చౌకదుకాణాల ద్వారా పేద ప్రజలందరికీ నిత్యావసర సరుకులు అందజేయాలని, లేనిఎడల పెద్దెత్తున ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రవిబాబు, మండల కార్యదర్శులు కొండలరావు, గోపాలరావు, ఆనందరావు, సహాయ కార్యదర్శి మహేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆదినారాయణ, మండల అధ్యక్షుడు రాంబాబు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్ ఎదుట 'న్యాయ పోరాట దీక్ష'



దీక్ష చేస్తున్న చింతకాని దళిత మహిళలు

చింతకాని: చింతకాని తహసీల్ ఎదుట గ్రామానికి చెందిన దళిత మహిళలు మంగళవారం న్యాయ పోరాట దీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చింతకాని గ్రామ పంచాయతీ పరిధిలోని దళిత కుటుంబాలకు పంపిణీ చేసిన మూడెకరాల భూమిలో అర్హులైన లబ్ధిదారులకు అన్యాయం జరిగిందన్నారు. ప్రభుత్వం గ్రామంలోని 60మంది దళిత నిరుపేదలకు 24 ఎకరాలను పంపిణీ చేయగా.. కొందరు అక్రమంగా రెవెన్యూ రికార్డులు చేయించుకుని భూమిని సేద్యం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి దీక్ష వద్దకు వచ్చి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు భూమి పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ దీక్షకు అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకయ్య, జిల్లా అధ్యక్షుడు శివలింగం సంఘీభావం తెలిపారు.

గ్రేస్ సంస్థ సేవలు అభినందనీయం

కొణిజర్ల: పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్న గ్రేస్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని కొణిజర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం శాంతకుమారి అన్నారు. గ్రేస్ సంస్థ చైర్మన్ ఎంఎం జాకబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కేంద్ర ప్రాథమిక పాఠశాల, హరిజన వాడ ప్రాథమిక పాఠశాల చిన్నారులకు బ్యాగులు, నోట్‌పుస్తకాలు, పెన్నులు వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రేస్ ప్రతినిధి వేణు అయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న వెంకటరాజ్యం

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో సీపీఎం వ్యవసాయ కార్మికసంఘం నూతన గ్రామకమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వ్యవసాయ కార్మికసంఘం మండల ప్రధాన కార్యదర్శి బందం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన మహాసభలో గ్రామ అధ్యక్ష, కార్యదర్శులుగా బోళ్ల వెంకటనర్సమ్మ, దూబ భద్రాచలంతో పాటు 7మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం నాయకులు బందం వెంకటరాజ్యం, సీతారాములు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



బీజేపీ పథకాలను ప్రజలకు వివరిస్తున్న నాయకులు

సత్తుపల్లిరూరల్: గ్రామంలోని ప్రతీ ఇంటికీ వెళ్లి కేంద్ర పథకాలను వివరించాని బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బేతుపల్లి గారమంలో ఆపార్టీ మండల మాజీ అధ్యక్షుడు పాలకొల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించగా.. మెదక్ జిల్లా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం పరిణీత, రాష్ట్ర నాయకులు, ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ రామలింగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, స్థానిక సంస్థల జిల్లా కన్వీనర్ ఈవీ రమేష్, పుల్లారావు యాదవ్, నాయుడు రాఘవరావు పాల్గొని మాట్లాడారు. మోదీ నాయకత్వంలో అభివృద్ధి, గ్రామీణ సంక్షేమం జరుగుతోందని వివరించారు. కార్యక్రమంలో మందశివ యాదవ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు నాగస్వామి, మాజీ కౌన్సిల్ సభ్యులు ప్రసాద్, శివ, సాయి, ఆంజనేయులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో అరకొర వసతులు

కల్లూరు: కల్లూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు హాస్టల్‌లో సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని భారతీయ జనతాపార్టీ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కరణం పరినితలు పేర్కొన్నారు. మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో హాస్టల్‌ను సందర్శించి బాలికలతో మాట్లాడారు. కార్యక్రమంలోబీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈవీ రమేష్, పుల్లారావు యాదవ్, మండల అధ్యక్షుడు రామకృష్ణ యాదవ్, పుల్లారావు, వెంకటేశ్వరరావు, నాగులు, వెంకటేశ్వరరావు, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్రం'



మాట్లాడుతున్న బాగం హేమంతరావు

కొణిజర్ల: బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు విమర్శించారు. సీపీఐ సీనియర్ నాయకుడు దొండపాటి వెంకయ్య వర్ధంతి సభ మంగళవారం కొణిజర్లలో నిర్వహించగా వెంకయ్య స్మారక స్థూపం నివాళులర్పించాక హేమంతరావు మాట్లాడారు. పాలకుల నిర్లక్ష్యంతో ఉపాధి కరువై యువత నిరాశకు గురవుతోందని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, నాయకులు జితేందర్‌రెడ్డి, బాబు, రమేష్, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, కృష్ణయ్య, భాస్కర్, వెంకటేశ్వర్లు, లక్ష్మి, సీతారాములు, రమేష్ పాల్గొన్నారు

బోడేపూడిది చెరిగిపోని చరిత్ర



వైరా : గండగలపాడులో బోడేపూడి స్మారక స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మధిర/వైరా: మధిర మాజీ ఎమ్మెల్యే బోడేపూడి వెంకటేశ్వరరావుది ప్రజల గుండెల్లో చెరిగిపోని చరిత్ర అని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్రావు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బోడేపూడి వర్ధంతి సందర్భంగా సీపీఎం నాయకుడు మడుపల్లి గోపాలరావు అధ్యక్షతన మంగళవారం మధిరలో 'భారతదేశ వ్యవసాయ రంగం – ఎదుర్కొంటున్న సవాళ్లు' అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారసత్వంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన బోడెపూడి నిత్యం రైతాంగ సమస్యలపై స్పందించేవారని తెలిపారు. కాగా, ప్రస్తుతం కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు వ్యవసాయ రంగం నుండి రైతులను క్రమంగా దూరం చేసే విధానాలు అవలంభిస్తున్నాయని ఆరోపించారు. ఈ సెమినార్‌లో నాయకులు శీలం నరసింహారావు, మందా సైదులు, చింతలచెరువు కోటేశ్వరరావు, పాపినేని రామ నరసయ్య, పడకంటి మురళి తదితరులు పాల్గొన్నారు. అలాగే, బోడెపూడి స్వగ్రామమైన వైరా మండలం గండగలపాడుతో పాటు వైరాలో జరిగిన ఆయన వర్ధంతి సభల్లోనూ పోతినేని సుదర్శనరావు మాట్లాడారు. బోడేపూడి ఆదర్శంగా కొత్త తరాన్ని రాజకీయాల్లోకి తీసుకురావాల్సిన అవసరముందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సీపీఎం నాయకులు బొంతు రాంబాబు, చింతనిప్పు చలపతిరావు, షేక్ జమాల్, రామారావు, నరసింహారావు, రవి, మోహనరావు, సుధాకర్ నాగులు పాషా, రాంబాబు, విద్యాసాగర్‌రావు, వీరభద్రం, మల్లికాంబ, తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, మల్లెంపాటి రామారావు, బొంతు సమత, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, కుటుంబరావు, మణి, రజిత, సుధాకర్ పాల్గొన్నారు.

వైరారూరల్: వైరా మండలంలోని గొల్లెనపాడులో మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బోడేపూడి వెంకటేశ్వరరావు వర్ధంతి సభ నిర్వహించగా నాయకులు బొంతు రాంబాబు, వెంపటి రాజా, శ్రీనివాస్, ప్రసాద్, రాజాబాబు, కంచర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బోనకల్/ఎర్రుపాలెం/తల్లాడ: బోనకల్, ఎర్రుపాలెంలోని సీపీఎం కార్యాలయాల్లో నిర్వహించిన బోడేపూడివర్ధంతి సభలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నాగేశ్వరావు, మండల కార్యదర్శి ప్రభాకర్ పాల్గొని మాట్లాడారు. అదే విధంగా తల్లాడలోని దొడ్డా కృష్ణయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి రామలింగేశ్వర్‌రావు మాట్లాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలే వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమాలల్లో పలువురు నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

సత్తుపల్లిటౌన్/తల్లాడ: సత్తుపల్లిలో, తల్లాడలోని.. పినపాక, వెంకటాపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం తల్లి పాల వారోత్సవాలు జరుపుకున్నారు. తల్లిపాల ఆవశ్యకత్తను వివరిస్తూ ముందుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ సూపర్‌వైజర్లు సత్యావతి, రమాదేవి, రత్నకుమారి మాట్లాడారు. తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం అని, రెండేళ్ల వరకు తల్లిపాలే ఇవ్వాలన్నారు. అనంతరం సామూహిక అన్నప్రాసనలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు సంధ్యారాణి, రాజ్యలక్ష్మి, నాగశిరోమణి, సంధ్య, లక్ష్మి, ఏడుకొండలు, రోజాకుమారి, ఉదయకుమారి, సునీత, రమాదేవి, సాజిదా, ఏఎన్ఎం మంజుల పాల్గొన్నారు.

మత్స్యశాఖ అధ్యక్షుడిపై దాడి సరికాదు

బోనకల్: రావినూతల మత్స్యశాఖ అధ్యక్షుడు బొమ్మకంటి సైదులుపై బీఆర్ఎస్ నాయకులు భౌతిక దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు గణపారపు వెంకటేశ్వర్లు, కార్యదర్శి రెడ్డిబోయిన ఉద్దండు తెలిపారు. మంగళవారం మండలంలోని రావినూతల గ్రామంలో నిర్వహించిన ముదిరాజ్ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో రావినూతల మత్స్యశాఖ అధ్యక్షుడు బొమ్మకంటి సైదులు, సంఘ నాయకులు వీరబాబు, నాగేశ్వరరావు, రాంబాబు, శ్రీకాంత్, బోనకల్, ముష్టికుంట్ల, చిరునోముల, లక్ష్మీపురం, తూటికుంట్ల సంఘం అధ్యక్షులు శ్రీనివాసరావు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

వాణి విద్యార్థులకు బహుమతులు

వైరా: ఈ నెల 3న ఖమ్మంలో నిర్వహించిన జిల్లాస్థాయి కరాటే పోటీల్లో వైరా వాణి వివేకానంద పాఠశాల విద్యార్థులకు బహుమతులు లభించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ చుండూరి వాణి తెలిపారు. పాఠశాలకు చెందిన జి.కోమలి, బి.మనస్వీ, జి.దుర్గా దీక్షిత, కరాటే పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించినట్లు తెలిపారు. కావున, మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెతో పాటుగా కరస్పాండెంట్ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు.. విద్యార్థులను అభినందించారు.

శ్రీకోటమైసమ్మ జాతరలో..
7న బహిరంగ వేలం

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లి శ్రీకోటమైసమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే.. జాతరలో ఈ నెల 7న కొబ్బరి కాయలు అమ్ముకొనుటకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు దేవాదాయ ధర్మదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి వేణుగోపాలాచార్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 26వ తేదీ నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు 11 రోజుల పాటు జాతరలో కొబ్బరి కాయలు, పూజా సామగ్రి అమ్ముకొనుటకు పాటాదారులు వేలంలో దక్కించుకోవచ్చునని పేర్కొన్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం



కృష్ణారెడ్డి కుటుంబానికి రూ.2 లక్షల చెక్కు అందిస్తున్న 'గ్రేట్' సభ్యులు

తల్లాడ: మండలంలోని కుర్నవల్లిలో నిరుపేద అయిన శీలం కృష్ణారెడ్డి కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల అసోషియేషన్(గ్రేస్) సభ్యులు బాధిత కుటుంబానికి మంగళవారం రూ.2లక్షలు ఆర్థిక సాయం అందించారు. నిరుపేద అయిన కృష్ణారెడ్డి కొత్తరకమైన వ్యాధితో నరాలు పూర్తిగా పనిచేయకుండా పోయాయి. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా ఏమాత్రం తగ్గకపోవడంతో దీర్ఘకాలిక వ్యాధి అని వైద్యులు తెలిపారు. దీంతో కృష్ణారెడ్డి భార్య శేషమ్మ అతన్ని దగ్గరుండి చూసుకోవాల్సి రావడంతో పూటగడవడం కష్టంగా మారింది. దీంతో గ్రేట్ సభ్యులు సాయమందించి తమ మంచిమనస్సు చాటుకున్నారు. కార్యక్రమంలో గ్రేట్ సభ్యులు దగ్గుల మాదవరెడ్డి, బొగ్గుల వెంకటరామిరెడ్డి, శ్రీకాంతరెడ్డి, బీమిరెడ్డి, కృష్ణారెడ్డి, అయిలూరి బాబు, సత్యనారాణరెడ్డి, రఘుపతిరెడ్డి, సిద్ధార్థరెడ్డి, చలపతిరెడ్డి, రామ శేషిరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, అజిత్‌కుమార్ రెడ్డి, సాంబశివరెడ్డి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

మధిర: మధిర ప్రభుత్వ ఆస్పత్రిలో లైఫ్ ఆఫ్ గివింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ ఎండీ ఫైమూన్ మాట్లాడుతూ.. రక్తదానం చేయుట వలన ఎంతో మందికి ప్రాణదానం చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ వైస్ చైర్మన్ డానియేల్ రాజు, మధిర ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ జైదాస్, ఎన్ఎస్ఎస్ పీఓ తారియా, సభ్యులు నాగరాజు, కృష్ణ, ఉపేందర్, గురవయ్య, కొండలరావు, విక్రమ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఏన్కూరు: మండల కేంద్రంలోని సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కమిటీ సభ్యులు ఇటికల లెనిన్, ఏర్పుల రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏన్కూరులో ప్రధానంగా డ్రెయినేజీ సమస్య, రాత్రి సమయాల్లో వెలగని వీధిలైట్లతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల మహిళ కమిటీ సభ్యురావు నాగమణి పాల్గొన్నారు.